క్లుప్తంగా

ప్రవేశ గడువు తేదీ పొడిగింపు

చింతూరు: మండలంలోని లక్కవరం ఏకలవ్య కళాశాలలో ఆన్‌లైన్ ప్రవేశానికి గడువు తేదీ పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కే.స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గడువు తేదీని ఈనెల 25 వరకు పొడిగించామని, విద్యార్థులు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు కేంద్రం ఏర్పాటు

రాజవొమ్మంగి: పది సప్లిమెంటరీ పరీక్షలు రాసే వారి కోసం రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు ఎంఈవో సూరయ్యరెడ్డి శుక్రవారం తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ విషయం గమనించాలని కోరారు. గతంలో రాజవొమ్మంగిలోనే పరీక్ష కేంద్రం ఉండేదని, స్థానికంగా తగినంత మంది విద్యార్థులు లేనందున ఈ దఫా పరీక్ష కేంద్రాన్ని రంపచోడవరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సప్లిమెంటరీ పరీక్షలు 24 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు



రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాల

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలో గల ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గిరిజన విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.వి. కృష్ణారావు కోరారు. ఈ పాఠశాలలో మొత్తం 31 సీట్లు ఖాళీగా ఉండగా, వీటిలో 16–బాలుర కోసం, 15–బాలికల కోసం కేటాయించినట్లు చెప్పారు. పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన వారు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీబీఎస్ఈ ఇంగ్లిష్ మీడియంలో బోధన, ఉచిత వసతి, భోజన సదుపాయం, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన జరుగుతుందన్నారు.

వరి విత్తనాల కోసం ప్రతిపాదనలు



ఏవో ఉమాదేవి

కొయ్యూరు: ఖరీఫ్ సీజన్‌లో మండలానికి 1060 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమున్నట్లు ప్రతిపాదించామని ఏవో ఉమాదేవి శుక్రవారం తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంటీయు– 1121 రకం 76 క్వింటాళ్లు, ఎంటీయు– 1064 రకం 210 క్వింటాళ్లు, ఎంటీయు–1061 రకం 40 క్వింటాళ్లు , ఎస్ఎల్ఆర్–34449 రకం 62 క్వింటాళ్లు, ఎంటీయు–1318 రకం 20 క్వింటాళ్లు, ఎంటీయు–1262 రకం 36 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్–2537 రకం 360 క్వింటాళ్లు, ఆర్ఎస్ఆర్–15048 రకం 176 క్వింటాళ్లు, బీపీటీ–5204 రకం 80 క్వింటాళ్లు కోసం ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. విత్తనాలు చేరగానే రైతులకు పంపిణీ చేస్తామన్నారు. 90 శాతం సబ్సిడీపై రైతులకు సరఫరా చేస్తామన్నారు.

లాగరాయి పీహెచ్‌సీ వైద్యుడిగా నాగార్జున



రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి పీహెచ్‌సీకు రెండవ డాక్టర్‌గా నాగార్జున శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు రాజవొమ్మంగి పీహెచ్‌సీలో పనిచేసి, బదిలీపై లాగరాయి వెళ్లారు. రాజవొమ్మంగిలో చార్జ్ అప్పగించిన నాగార్జున శుక్రవారం నుంచి విధుల్లో చేరారు.

రేపటి నుంచి రెండో విడత చందనం అరగదీత

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కొబ్బరితోటలో వేంచేసిన శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారికి రెండవ విడత చందనం అరగదీత కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు ఆలయ ఆవరణలో చందనం అరగదీత, 23న వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున స్వామికి రెండో విడత చందన సమర్పణ జరుగుతుందన్నారు. చందన అరగదీత కార్యక్రమంలో పాల్గొనే భక్తులు 81213 16268 నంబరును సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పరవళ్లు

- పి.యర్రగొండలో కోట్లాది రూపాయలతో పురోగతి
- గ్రామాలకు రహదారులు, ఇంటింటికీ కుళాయి
- ఆనందంలో గిరిజనులు



వై.రామవరం మండలం పి.యర్రగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామసచివాలయం



వై.రామవరం మండలం పి.యర్రగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు



ఏకలవ్య పాఠశాల

వై.రామవరం: మండలంలోని ప్రతి గ్రామంలో నేడు అభివృద్ధి కనిపిస్తోంది. ఒకప్పుడు టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని ఏ గ్రామంలో అభివృద్ధి జరగలేదు. చంద్రబాబు పాలనలో వై.రామవరం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. సరైన రహదారులు లేక..తాగునీటి సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యల పరిష్కారం కోసం అప్పటి టీడీపీ పాలకులకు, యంత్రాంగానికి వినతులిచ్చినా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామాలకు వెళ్లేందుకు అత్యవసర సమయాల్లో వైద్య సేవలకు సంబంధించి 108, అంబులెన్స్ సేవలందక మృత్యువాతకు గురైన సంఘటనలు కోకొల్లలు. తాగునీటి కోసం కిలోమీటర్ల దూరంలో గెడ్డలను, పాడుబడిన బావులను ఆశ్రయించేవారు. కలుషిత నీరు వినియోగించడంతో రోగాల బారిన పడేవారు. దశాబ్దాలుగా గ్రామస్తులు సమస్యలతో సావాసం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శివారు గ్రామాల్లోనూ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. ఫలితంగా మండలంలోని అన్ని ప్రాంతాల్లో రహదారులతో పాటు తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు దర్శనమిస్తున్నాయి. అధ్వాన స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు నాడు–నేడు ద్వారా జీవం పోశారు. సర్కారు పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ఉత్తమ బోధన, మెరుగైన సదుపాయాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయమంగా పెరుగుతోంది. ప్రభుత్వ సేవలందించేందుకు గ్రామ సచివాలయాలు, అన్నదాతలకు సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకే)ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయి. ఒకప్పుడు ఏ ధ్రువపత్రం పొందాలన్నా నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని నేడు ఆ పరిస్థితి లేదని, గ్రామ వలంటీర్ ద్వారా పూర్తిస్థాయిలో సకాలంలో సేవలందుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఆర్‌బీకే ద్వారా పంటల సాగుపై సూచనలు, సలహాలను సిబ్బంది ఇస్తున్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులను అందజేస్తున్నారు. వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో వచ్చి పంటల స్థితిగతులు ఇతరత్రా విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పి.యర్రగొండ పంచాయతీలో రెండు గ్రామాలుండగా, జనాభా 3500 మంది నివసిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మండలంలోని పి.యర్రగొండ (పసరిగిన్ని యర్రగొండ) గ్రామం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది.

అభివృద్ధి పనులివీ..

- పి.యర్రగొండలో సుమారు రూ. 10 లక్షలతో తాగునీటి పథకం నిర్మాణం
- పంచాయతీలో సుమారు రూ. 22 లక్షలతో రైతు భరోసాకేంద్రం నిర్మించారు.
- ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలను ఏర్పాటు చేశారు. నాడు–నేడు ద్వారా సుమారు రూ. 17లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేశారు.
- చీడిమానువీధి నుంచి పసరిగిన్ని గ్రామం వరకు రూ.15లక్షలతో రహదారి నిర్మాణం.
- పసరిగిన్ని గ్రామం నుంచి దారలోవ గ్రామానికి ఆరు కిలోమీటర్ల రూ.50లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు.
- దారలోవ, నులకమద్ది , పసరిగిర్ని.పి.యర్రగొండ గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా సుమారు రూ.60లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేశారు
- పంచాయతీలోఅన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు అందుబాటులో ఉన్నాయి.
- పి.యర్రగొండ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటుచేసి ఎం.ఎల్.పీహెచ్‌వో, సిబ్బందిని ఏర్పాటుచేసి పంచాయతీ పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య సేవలందిస్తున్నారు.



వై.రామవరం మండలం పి.యర్ర గొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం

మునుపెన్నడూ లేనంత అభివృద్ధి



గ్రామంలో మునుపెన్నడూ లేనంత అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జరుగుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సరైన రహదారులు లేక నానా అవస్థలు పడ్డాం. తాగునీటి కోసం కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. గ్రామాల్లో రహదారులు, తాగునీటి పనులు జరిగాయి. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబం సంక్షేమ పథకాల లబ్ధి పొందింది. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

– కిచ్చల విశ్వమ్మ, పి.యర్రగొండ గ్రామం, వై.రామవరం మండలం

ప్రగతి పరుగులు



పి.యర్రగొండ పంచాయతీలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీస అభివృద్ధి జరగలేదు. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దశాబ్దాలుగా సమస్యలతో సతమతమయ్యారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి గ్రామానికి రహదారులు అందుబాటులో వచ్చాయి. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఉంది. ప్రత్యేక నిధులతో శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు జరిగాయి. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. ఆరోగ్య ఉప కేంద్రం ద్వారా గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. పంచాయతీలో ప్రగతి పరుగులు పెడుతోంది.

– పల్లాల రాజేశ్వరి, సర్పంచ్, పి.యర్రగొండ

మోదమ్మ ఆలయ సింహద్వారం ప్రారంభం



మోదకొండమ్మతల్లి ఆలయంలో సింహద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయ సింహద్వారాన్ని శుక్రవారం ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. సింహద్వారం నిర్మాణానికి ఆర్థికసాయం చేసిన యూనివర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మీసాల దుర్గాప్రసాద్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహచలంనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, ప్రసాద్‌నాయుడు, వెంకటరమణ, శ్రీను, రాజబాబు, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన కొమరవోలు తల్లి ఉత్సవాలు



ఉత్సవంలో ఆకట్టుకున్న శక్తి నృత్యం



బాణసంచా కాల్పులు

- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న నేల డ్యాన్సులు

రోలుగుంట: కొమరవోలు తల్లి ఉత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ముగిశాయి. కొమరవోలులో ఈ నెల 12న ప్రారంభమైన గ్రామ దేవత ఉత్సవాలు ప్రతి మూడేళ్లకొకసారి నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా గ్రామంలో ఆవల గంగాదేవి ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవాన్ని మత్స్యకార కుటుంబాల వారు జరుపుకున్నారు. ఈ నెల 14న ఇటంశెట్టి వారి కళ్లాలు వద్ద పండగ నిర్వహించారు. ముగింపు రోజున ఇలవేల్పు కొమరవోలు తల్లి పండగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా విద్యుత్ దీపాలతో వీధులు అలంకరించారు. రహదారికి ఇరువైపులా ప్రధాన కూడలి వద్ద ప్రదర్శించిన దేవతామూర్తులు విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది. ఊరేగింపులో శక్తి డ్యాన్సులు, యువకుల నృత్యాలు విశేషంగా అలరించాయి. ఆకాశం మిరుమిట్లు గొలిపేలా భారీ బాణ సంచా కాల్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గొర్లె చెల్లంనాయుడు, ఎంపీటీసీ సభ్యులు గొర్లె వెంకటరమణ, బోళెం దొరబాబు సారథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఉత్సవం సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జీవాలకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు



ఎ.కోడూరులో ఈటీ వ్యాక్సిన్లను చేస్తున్న పశువైద్య సహాయకుడు సాయికుమార్

కె.కోటపాడు: వర్షాకాలం సమయాల్లో గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి సోకకుండా ఉండేందుకు పెంపకందారులు తప్పనిసరిగా ఎంట్రో టాక్సీమియా(ఈటీ) వ్యాక్సిన్‌ను వేయించాలని పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. శుక్రవారం ఎ.కోడూరులో 120 గొర్రెలు, మేకలకు ఈటీ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ మూడు నుంచి ఆర్నెల్ల వయస్సు గల గొర్రెలు, మేకలు ఈ వ్యాధి బారిన పడే పరిస్థితి ఉందన్నారు. గొర్రెలు, మేకలు పారుకోవడం వల్ల నీరసించిపోయి మరణిస్తాయని రైతులకు వివరించారు. ఈ నేపథ్యంలో వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా పశు సంవర్థకశాఖ ద్వారా ఉచితంగా ఈటీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకూ నిర్వహిస్తామన్నారు.

జోరుగా చెరకు నాట్లు



చెరకు నాట్లు వేస్తున్న పెదగోగాడ రైతులు

చీడికాడ: మండలంలో మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలతో మెట్ట గ్రామాలైన అర్జునగిరి, పెదగోగాడ, చెట్టుపల్లి, చుక్కపల్లిలో చెరకు నాట్లు జోరుగా సాగుతున్నాయి. దీంతో కూలీలకు, చెరకు విత్తన తోటలకు డిమాండ్ ఏర్పడింది. ఉపాధి పనులు చేస్తుండడంతో వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధానిస్తే మేలు కలుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం



బొబ్బిలి లక్ష్మణ్

గూడెంకొత్తవీధి: రాష్ట్రంలో మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని పాడేరులోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అఖండ విజయం సాధిస్తారని పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకూ ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని అందించారన్నారు. ఇటీవల జరిగిన పోలింగ్‌లో ప్రజలంతా మరోమారు జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలనే సంకల్పంతోనే పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమమే మరోసారి అధికారాన్ని కట్టబెడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పార్క్ సెంటర్ గౌరీ పంచాయతన దేవాలయంలో శుక్రవారం శ్రీ గౌరీపరమేశ్వరుల 192వ ఊంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్తులచే ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయిలు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం గౌరీ గీతా మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృత వర్షిణి వ్యవస్థాపకులు పెతకంశెట్టి సుజాత ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవం



అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజాము 5 గంటలకు అమ్మవారి పల్లకీ ఊరేగింపు, నిత్య ప్రార్థనలు, గోపూజ, శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీ జనార్దన స్వామివార్లకు అభిషేకాలు, అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులచే ఆలయ ముఖ మండపంలో ధాన్యాభిషేకం, లక్ష మల్లెలతో అర్చన, సామూహిక లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం పేద మహిళలకు చీరల పంపిణీ, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం 102 రకాల స్వీట్లతో అమ్మవారికి నివేదన, ఊంజల్ సేవ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆలయ కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వర రావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధిక రక్తపోటుతో అప్రమత్తంగా ఉండాలి



లాగరాయిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ ఉషశ్రీ , సిబ్బంది

రాజవొమ్మంగి: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా మండలంలోని లాగరాయి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. శిబిరంలో 35 సంవత్సరాల వయస్సు దాటిన 50 మందికి పీహెచ్‌సీలో టెస్టులు చేసి బీపీ ఉన్న వారికి మందులు అందజేసినట్లు చెప్పారు. రక్తపోటుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీల ఆధ్వర్యంలో గ్రామాల్లో కూడా వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ర్యాలీ నిర్వహించి అధిక రక్తపోటు నివారణ, గుర్తింపుపై ప్రజలకు అవగాహన కల్పించామని డాక్టర్ ఉషశ్రీ చెప్పారు.

పొంచి ఉన్న ప్రమాదం



లుంగాపుట్టు వద్ద రహదారి వైపూ ఒరిగి ఉన్న ఎండిన చెట్టు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన మార్గంలో లుంగాపుట్టు మలుపు వద్ద భారీ చెట్టు పూర్తిగా ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎండిన చెట్టు చూసిన వాహనచోదకులు భయం భయంగా ప్రయాణం చేస్తున్నారు. ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. చెట్టు కూలీ ప్రమాదం జరగకముందే పంచాయతీ అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా చెట్టు ఒరిగిపోవడంతో వాహనచోదకులు మరింత భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

వెంకటాద్రిపై ఘనంగా ధ్వజారోహణ

- రెండో రోజు వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ధ్వజారోహణ, హోమాలు జరిపారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. పూజల్లో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: జంపెనలో వాసవీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు తెలిపారు.

23న బుద్ధ జయంతి వేడుకలు

అనకాపల్లి: మండలంలోని శంకరం పంచాయతీ పరిధి బొజ్జన్నకొండ వద్ద ఈ నెల 23న బుద్ధ జయంతి(బుద్ధ పూర్ణిమ) వేడుకలు నిర్వహించనున్నట్లు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుద్ధ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి 22 వరకు విద్యార్థులకు బొజ్జన్న కొండ చరిత్ర, విశిష్టతపై జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు జరపనున్నట్లు పేర్కొన్నారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొనే విద్యార్థులు నాలుగు పేజీలకు మించకుండా తెలుగులో రాసిన వ్యాసాలను నేరుగా వాట్సాప్ 89770 20615, 94932 56300 నంబర్లకు పంపించాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 23న బొజ్జన్నకొండ వద్ద బహుమతులు అందిస్తామన్నారు.